ప్రజాశక్తి
గురువారం 29 జూన్ 2023
5
శ్రీకాకుళం

చెక్కును విడుదల చేస్తున్న స్పీకర్, కలెక్టర్ తదితరులు

'మద్దతు'పై మీనమేషాలు

- జీడి పిక్కల ధరలు పతనం
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- నైరాశ్యంలో జీడి రైతాంగం

జీడిపిక్కలకు మద్దతు ధరపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.10 వేలు ధర కల్పించి రైతులకు అండగా ఉంటామని చెప్పిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీదిరి అప్పలరాజు మాటలు నీటిమూటలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా మంత్రి ఇచ్చిన హామీ అమలు కాకపోగా, ఐదేళ్ల కిందట రూ.14వేలు పలికిన జీడి పిక్కల బస్తా నేడు రూ.ఏడు వేలకు పడిపోయింది. దీంతో ఎకరాకు సుమారు రూ.30వేలు పెట్టుబడి పెట్టి పంట పండించిన జీడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు పరిశ్రమల బంద్ పేరుతో జీడి వ్యాపారులు సరికొత్త డ్రామాకు తెరతీశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది.

ప్రజాశక్తి - కవిటి

పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట ఉద్దానం ప్రాంతాలతో పాటు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. ఈ పంటే జీవనాధారంగా సుమారు 80 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తిత్లీ తుపాను జీడి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. తుపానుకు ఎక్కడికక్కడ నేలకొరిగిన చెట్లు తొలగించేందుకు పెట్టుబడులు పెట్టగా, మరోవైపు ఉన్న చెట్ల దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాడైన చెట్ల స్థానంలో కొత్త జీడి మొక్కలను పెంచుతున్నారు. మూడేళ్లుగా దిగుబడులు తగ్గి తీవ్ర నష్టాలు చవిచూసిన రైతులకు ఈ ఏడాది జీడి పిక్కల దిగుబడి పెరగడంతో అప్పుల ఊబి నుంచి ఎంతోకొంత గట్టెక్కవచ్చని సంతోషించారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆ ఆనందం వారిలో ఆవిరైంది. ఇటీవలి కాలంలో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.ఎనిమిది వేలు ఉండగా, జీడిపిక్కలు పంట వచ్చేసరికి ఒక్కసారిగా ఆ ధర రూ.7 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయింది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

గిట్టుబాటు ధర రాకపోగా, మరీ అంత తక్కువ ధరకు అమ్ముకోలేక ఇళ్లల్లోనే జీడి పిక్కల బస్తాలను ఉంచారు. కొందరు రైతులు చేసిన అప్పుల వడ్డీలు కట్టేందుకు, ఇతర కుటుంబ అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో బస్తాను రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు తెగనమ్ముకున్నారు. గతేడాది కన్నా ధర పెరుగుతుందని భావిస్తే, అంతకంటే తగ్గడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.తొమ్మిది వేలు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం నుంచి అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గతంలో హామీనిచ్చారు. ఆ హామీ నేటికీ నెరవేరకపోగా, ఉన్న ధర కూడా పతనమవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

రైతుల వద్ద నిల్వ ఉన్న జీడి పిక్కల బస్తాలు

స్థానిక రైతులకు మొండిచేయి

విదేశాల నుంచి వచ్చే లగ్జరీ కార్లు తదితర వాటిపై శత శాతం పన్ను విధించి స్థానిక కార్పొరేట్లకు ప్రోత్సాహం ఇచ్చే కేంద్ర ప్రభుత్వం, జీడి రైతుల విషయానికొచ్చేసరికి ఉదాసీన వైఖరి అవలంభిస్తోంది. విదేశాల నుంచి దిగుమతి అయ్యే జీడిపిక్కలు, జీడిపప్పుపై 2.5 శాతం మాత్రమే పన్ను విధిస్తుండడంతో స్థానిక వ్యాపారులు విదేశీ పిక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. ఉద్దానంలో పండిన జీడిపిక్కలను తూతూమంత్రంగా కొనుగోలు చేసి రైతులకు ఎంతో కొంత చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యం టన్నుల కొద్దీ వాడే జీడిపప్పును విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తూ స్థానిక రైతులకు మొండిచేయి చూపిస్తోంది.

ధర ఎగ్గొట్టేందుకు డ్రామాలు

మరోవైపు వ్యాపారులు సరికొత్త డ్రామాకు తెరతీశారు. జీడిపప్పు విక్రయాల్లేకపోవడంతో ధర పడిపోయిందని, నిల్వలు పేరుకుపోయాయని చెప్తూ జులై ఐదో తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు పరిశ్రమల బంద్‌కు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాము రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయలేమని చెప్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో నిర్వేదంలో కూరుకుపోతున్నాడు జీడి రైతు. ఇప్పటివరకు తమ వద్ద కొన్న జీడిపిక్కల ద్వారా ఉత్పత్తి చేసిన పప్పును పలు గ్రేడ్‌లు చేసి కేజీ రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు అమ్మిన వ్యాపారులు తమకు మాత్రం 80 కేజీల బస్తాకు రూ.ఎనిమిది వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోతున్నారు. వ్యాపారులు జీడిపప్పు రేటు తగ్గిందని చెప్తున్నా, మార్కెట్‌లో కేజీ రూ.600కి తగ్గడం లేదని, నాసిరకం పప్పు రేటును నాణ్యమైన పప్పుకు అన్వయించి వ్యాపారులు ధర తగ్గిందని గగ్గోలు పెడుతున్నారని చెప్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఎంతోకొంతకు తెగనమ్ముకున్న తర్వాత జీడిపప్పు ధర అమాంతం పెరుగుతుందన్నది బహిరంగ రహస్యమేనని చెప్తున్నారు.

స్పందించని పార్టీలు

సుమారు 40 రోజులుగా రైతులు, రైతుసంఘాలు జీడిపిక్కల మద్దతు ధర కోసం పోరాడుతుంటే వామపక్షాలు తప్ప మిగతా రాజకీయ పార్టీలు రైతుల గోడును వినిపించుకున్న దాఖలాల్లేవు. అధికార పార్టీ ఇచ్చిన హామీనే అమలు చేయలేదు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రశ్నించేందుకు వచ్చామని చెప్తున్న జనసేన జీడి రైతుల తరుపున ప్రశ్నించిన దాఖలాలే లేవు.

ఇలా అయితే ఎలా పండించగలం?

జీడిపిక్కలను మద్దతు ధరకు కొనాలి. వేలల్లో పెట్టుబడులు పెట్టి ఎండనక, వాననక పిక్కా పిక్కా కూడబెడితే వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రేటు నిర్ణయిస్తున్నారు. ఇలాగైతే జీడి పంటను ఎలా సాగు చేయగలం. ప్రభుత్వం మా బాధను పట్టించుకోవడం లేదు.

- బల్లెడ మోహనరావు, రైతు, బైరిపురం

రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలి

జీడి వ్యాపారులు, పరిశ్రమలపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఒకరో, ఇద్దరో కూర్చొని మొత్తం జీడిపంట ధరను ఎలా నిర్ణయిస్తారు. గతంలో బస్తాకు వచ్చే పప్పు దిగుబడి బట్టి ధర ఉండేది. ప్రస్తుతం అది లేదు. తక్కువ గ్రేడ్ రకం ధరలు తెలియజేస్తూ జీడిపప్పు ధర తగ్గిందని చెప్తున్నారు. తమకు అవసరమైన సరుకు నిల్వ చేసుకుని పరిశ్రమలు మూసివేస్తామంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. రూ.16 వేలు మద్దతు ధర కల్పించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- తెప్పల అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్, జీడి రైతుల సంఘం

విద్యార్థులకు 'అమ్మఒడి' వరం

- పాఠశాలల ఆధునీకరణతో మౌలిక వసతులు
- జిల్లాలో 1,91,689 మందికి రూ.287.53 కోట్లు జమ
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అమ్మఒడి పథకం విద్యార్థులకు వరమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, నాడు-నేడు, వసతి దీవెన, విద్యా దీవెన, గోరుముద్ద వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి రాష్ట్ర ప్రతిష్టను పెంచాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బడికి పంపి చదివించాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలను ఆధునీకరించడం వల్ల మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటిని వినియోగించుకుని విద్యాభివృద్ధి సాధించాలని చెప్పారు. జిల్లాలో 1,246 పాఠశాల భవనాలు నాడు-నేడు కింద కార్పొరేట్ స్థాయిలో మార్పులు చేసినట్లు తెలిపారు. రూ.700 కోట్లు ఖర్చు చేసి జిల్లాలో 158 పాఠశాలలు, 38 జూనియర్ కళాశాలల పనులు పూర్తి చేసినట్లు చెప్పారు.

విద్యార్థుల్లో మరింత ఉత్సాహం కల్పించాలనే ఇంటర్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. జిల్లాలో అమ్మఒడి పథకం కింద 1,91,689 మంది తల్లుల ఖాతాలకు రూ.287.53 కోట్లు జమ చేసినట్లు వివరించారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, డిప్యూటీ డిఇఒ జి.పగడాలమ్మ, సహాయ కమిషనర్ అలీఖాన్, రీజనల్ ఇంటర్మీడియట్ అధికారి దుర్గారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలపై దృష్టి

ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి

ప్రజాశక్తి - పలాస

రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలపై దృష్టిసారించాలని పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి మండలస్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పలాస నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఒలు, తహశీల్దార్లతో ఆర్ అండ్ ఆర్ కాలనీపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల కాలనీలో తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లు, కాలువలు ఉన్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు.

కాలనీలో సమస్యలు ఉన్నాయని, అసంపూర్తిగా భవనాల నిర్మాణం జరిగిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్లు ఎల్.మధుసూదనరావు, బి.పాపారావు, అప్పలస్వామి, ఎంపిడిఒలు రమేష్‌నాయుడు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్-2023 (ఇండియా@2047)ను బుధవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచప్రాణాలు (ఐదు సంకల్పాలు) అనుసరించడం ద్వారా 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు.

నెహ్రూ యువ కేంద్రం అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ యువశక్తి పెంపుదలలో భాగంగా యువ ఉత్సవ్ 2023 పేరున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో డిబేట్, యువ కళాకారులు, రచయితలు, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక సంప్రదాయక వారసత్వ ప్రదర్శనలు అంశాల వారీగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందిచనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నామన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతామన్నారు. తొలుత ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కన్నతండ్రే కాలయముడు

- కుటుంబ కలహాలతో కుమారులపై కత్తితో దాడి
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కుటుంబ గొడవల్లో తనకు మద్దతు ఇవ్వడం లేదన్న ఆగ్రహంతో కన్న తండ్రే కాలయముడై నిద్రిస్తున్న కుమారుడిని కత్తితో అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మండలంలోని కుప్పిలిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తాతారావు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుప్పిలికి కొండ్రు కుప్పయ్య, భార్య హరమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె అప్పాయమ్మకు వివాహం చేశారు. ఆమె అదే ఊళ్లో అత్తారింట్లో ఉంటోంది. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాలతో భార్యాభర్తలు దూరంగా ఉంటూ ఇటీవల అసిరతల్లి ఉత్సవాల సందర్భంగా ఒక్కటయ్యారు. అయినా వారు తరచూ గొడవలు పడేవారు. ఇద్దరు కుమారులు తాతారావు, కామరాజు, కుమార్తె లక్ష్మి తల్లికి మద్దతుగా ఉండేవారు. తల్లిని వెనకేసు కొస్తున్నారని కోపోద్రిక్తుడైన కుప్పయ్య కుటుంబ సభ్యులందరినీ హతమార్చాలని భావించాడు. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబసభ్యులపై వ్యవసాయ పనులకు ఉపయోగించే పెద్ద కత్తితో దాడికి పాల్పడ్డాడు.

గాయపడిన కామరాజు

రక్తపుమడుగులో పడి ఉన్న తాతారావు

ఈ దాడిలో తాతారావు అక్కడికక్కడే మృతి చెందగా, రెండో కుమారుడు కామరాజు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వాళ్లు రావడంతో కుప్పయ్య పారిపోయాడు. కామరాజును ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న డిఎస్‌పి శ్రావణి, జె.ఆర్ పురం సిఐ ఆదాం, ఎస్ఐ సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాతారావు (ఫైల్)

నిందితుడు కుప్పయ్య

రిమ్స్ ఆర్ఎంఒ శివాలు

- తొడగొట్టి, మీసాలు మెలేసి జర్నలిస్టులకు బెదిరింపులు
- రిమ్స్ ఎదుట జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ సిఎస్ ఆర్ఎంఒ శంకరరావు తన వివాదాస్పద తీరుతో మరోసారి రచ్చకెక్కారు. తొడగొట్టి, మీసాలు మెలేయడంతో పాటు జిల్లాను, జర్నలిస్టులను దూషించారు. వివరాల్లోకి వెళ్తే ఎచ్చెర్ల మండలంలో హత్య కేసులో రిమ్స్ మార్చురీ వద్ద మృతదేహం, క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలిసి వార్త కవరేజ్ కోసం బుధవారం మీడియా ప్రతినిధులు రిమ్స్‌కు వెళ్లారు. లోపలకు రావడానికి వీల్లేదంటూ సిఎస్ ఆర్ఎంఒ శంకరరావు మీడియాను బయటకు గెంటేశారు. దీంతో వారంతా రిమ్స్ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. దీన్ని కవర్ చేయడానికి కెమెరాతో వెళ్తున్న ఒక ఛానల్ ప్రతినిధిని ఆస్పత్రి గేటు వద్ద శంకరరావు అడ్డుకున్నారు. తన అనుమతి లేకుండా రిమ్స్‌లోకి రావడానికి ఒప్పుకోనని హూంకరించారు. మార్చురీ వద్ద క్రైమ్ రిపోర్టు చేయడానికి వచ్చామని, అనుమతి అవసరం లేదని ఆయన చెప్పారు. లోపలకు వెళ్తున్న ఆయన్ను శంకరరావు నెట్టేశారు. ఆ ఛానల్ మరో ప్రతినిధి ఆర్ఎంఒకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు సరికదా, ఇంకా ఎక్కువ మాట్లాడితే తానేంటో చూపిస్తానంటూ తొడగొట్టారు.

తొడగొడుతున్న శంకరరావు

విషయం తెలుసుకున్న జర్నలిస్టు సంఘాల నాయకులు అక్కడకు చేరుకుని ఆర్ఎంఒ తీరుకు నిరసనగా ధర్నా చేశారు. దీంతో మరింత ఆగ్రహోదగ్రుడైన శంకరరావు 'వెనుకబడిన జిల్లా నా కొడుకులు, జర్నలిస్టుల వల్లే జిల్లా పాడైపోయింది' అంటూ తీవ్రస్థాయిలో దూషించారు. దీంతో జర్నలిస్టు సంఘ నాయకులు అక్కడ్నుంచే కలెక్టర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించడంతో పాటు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం అమ్మఒడి కార్యక్రమానికి వచ్చిన స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి ఆర్ఎంఒ తీరును వివరించారు. ఆర్అండ్‌బి బంగ్లా వద్దకు రావాలని స్పీకర్ ఆర్ఎంఒకు కబురు పంపారు. ఆయన రాకపోవడంతో వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌కు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.పార్వతి ఉత్తర్వులు జారీ చేశారు.

రిమ్స్ ఎదుట బైఠాయించిన జర్నలిస్టులు

పరిశీలిస్తున్న జెసి నవీన్

పర్యాటక కేంద్రంగా శివసాగర్ బీచ్ అభివృద్ధి

జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

అక్కుపల్లి శివసాగర్ బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. పర్యాటక కేంద్రం కోసం సేకరించిన రెవెన్యూ, సిఆర్‌జెడ్ భూములను బుధవారం పరిశీలించారు. భవిష్యత్‌లో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. పర్యాటక రంగం ద్వారానే ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ సుభాష్, విఆర్ఒలు ఇందిరా ప్రియదర్శిని, వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధులు లండ రామలింగం, డొంక విద్యాసాగర్‌తో పాటు దున్న శ్రీనివాస్, కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

నాలుగేళ్ల వైసిపి పాలనలో దోచుకున్న కోట్లాది రూపాయల సొమ్మును తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక పైసాతో సహా కక్కిస్తామని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. టిడిపి పట్టణాధ్యక్షులు కోళ్ల లవకుమార్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. సంక్షేమ పథకాల పేరు చెప్పి ప్రజలపై ధరల బాదుడు బాదుతోందని ధ్వజమెత్తారు. భూములు, కొండలు, గుట్టలు, ఇసుక, గనులు అన్నింటినీ అధికార పార్టీ నాయకులు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. మైనింగ్, ఇసుక వంటి వాటిని ప్రయివేట్ వ్యక్తులకి అప్పగించి వారి నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందని విమర్శించారు. అక్రమాలను ప్రశ్నించిన వారిని అరెస్టులు చేస్తూ అరాచక పాలన సాగిస్తోందన్నారు.

సంపద సృష్టించి సంక్షేమ పథకాల అమలు

రాష్ట్ర విభజన అనంతరం అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం లోటు బడ్జెట్‌లోనూ సంక్షేమ, అభివృద్ధి పాలనను అందించిందని చెప్పారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే సత్తా ఒక్క చంద్రబాబు నాయుడికే ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలు ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించగలవన్నారు. సంక్షేమ పథకాలను అందిస్తూనే ప్రజలపై భారాలు వేయకుండా, సంపద సృష్టిస్తామన్నారు. సమావేశ అనంతరం ఇటీవల మృతి చెందిన కోళ్ల కుంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, టిడిపి నాయకులు మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, ఆర్.ప్రీతీష్‌చంద్, ఎం.బాలకృష్ణ, గండి చందరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశంలో సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ముందుగా గ్రామాల్లో పాడైపోయిన పాత విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు విద్యుత్‌శాఖ ఎఇ దుర్గాప్రసాద్‌ను కోరారు. కింతలిలో లోవోల్టేజీ సమస్య ఉందని ఎన్నిసార్లు చెబుతున్నా పరిష్కారం కావడం లేదని, దీంతో ప్రజలు తమను నిందిస్తున్నారని సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావులు ఎఇని ప్రశ్నించారు. ఎఇ స్పందిస్తూ... ఇప్పటికే గ్రామంలో పలుచోట్ల లోవోల్టేజీ సమస్యలు పరిష్కరించామని, మిగిలిన చోట్ల పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో పంచాయతీకి వస్తున్న 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు కేవలం విద్యుత్ బిల్లులు చెల్లించడానికే సరిపోతున్నాయని పిల్లలవలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు అన్నారు. నాడు-నేడు పనులతో ఇప్పుడున్న చాలా తరగతి గదులను తొలగించడంతో విద్యార్థులు తీవ్ర

నాడు-నేడు పనులపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ పోలినాయుడు

ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆరుబయట చెట్లు కిందన కూర్చొని పాఠాలు వింటున్నారని, వర్షాకాలం రావడంతో ఎక్కడ కూర్చోవాలో తెలియక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. పంచాయతీరాజ్ బిల్లులు సకాలంలో రావడం లేదని సభ్యులు అనడంతో పంచాయతీరాజ్ డిఇ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మండలంలో పిఆర్ ఎఇ ఫాల్గుణరావు ఏమయ్యాడో తెలియడం లేదనడంతో సభ్యులంతా ఆశ్చర్యపోయారు. ఎఇ సెలవు తీసుకోకుండా, విధులకు హాజరు కావడం లేదని పేర్కొన్నారు. కొత్తగా ఇన్‌ఛార్జి ఎఇని నియమించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మాజీ ఎంపిపి, కోటిపల్లి ఎంపిటిసి కూన ప్రమీల మాట్లాడుతూ తాడివలస పంచాయతీ కార్యదర్శి అసలు పంచాయతీకే రావడం లేదని, దీంతో గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఆయన గురువారం విధులకు రాకపోతే ఆయన స్థానంలో మరొకరిని నియమిస్తానని ఎంపిడిఒ సీపాన హరిహరరావు సమాధానమిచ్చారు. కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యం పంపిణీ చేయడం లేదని తహశీల్దార్ రాంబాబును ప్రశ్నించగా, డిసెంబరు నుంచి ఉచిత బియ్యం రావడం లేదని అన్నడంతో... దీనిపై పూర్తిస్థాయిలో తనకు సమాచారం కావాలని ఆమె కోరారు. అనంతరం మండల పరిషత్ నిధులతో పలు పనుల నిర్వాహణకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వండాన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ, పొందూరు సర్పంచ్ లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న నాయకులు

ఉచిత విద్యుత్ అంటూ భారాలా?

వజ్రపుకొత్తూరు : వైసిపి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అంటూ హామీలు ఇచ్చి... ఇప్పుడు సామాన్యులు మోయలేని విద్యుత్ భారాలు మోపుతున్నారని సిపిఎం మండల కన్వీనర్ ఎన్.మోహనరావు అన్నారు. ఈనెల 30న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పూండి బస్టాండ్ వద్ద పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రూపంలో ప్రజల నుంచి అదనపు వసూలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీని పెంచుతున్నాయని విమర్శించారు. ఇంధన సర్దుబాటు పేరుతో భారీ వడ్డన దారుణమన్నారు. ఛార్జీలను తగ్గించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బమ్మిడి ఆనందరావు, కవిటి బాలరాజు, బమ్మిడి రామకృష్ణ, ఎన్.చంద్రయ్య, డి.భాస్కరరావు, పాపారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా రూ.వంద కోట్ల వ్యయంతో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేసేందుకు పనులు చేపడతామన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి తాగునీరు అందిస్తామని చెప్పారు. కాలువ విస్తరణ పనులు పూర్తి చేసి మున్సిపాలిటీకి కానుకగా ఇస్తామన్నారు. ఇప్పటికే రైల్వే వంతెన పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తిచేసి రాకపోకలు జరిగే విధంగా చర్యలు చేపడుతున్నమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, డబ్బీర్ భవానీశంకర్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, జోగారావు, బోర చంద్రకళ, దుర్గాశంకర్ పండా, సవర సోమేశ్వరరావు, జోగి సతీష్, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, మున్సిపల్ ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : భారతీయ రిజర్వు బ్యాంకు ఆర్థిక సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యాన అఖిల భారత స్కూల్ క్విజ్-2023 జిల్లాస్థాయి పోటీలను లీడ్ బ్యాంకు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు మేనేజర్ సూర్యకిరణ్ పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించడానికి ఈ క్విజ్ పోటీలు దోహపడతాయని అన్నారు. గెలుపొందిన విద్యార్థులను విశాఖపట్నంలో జులై 14న జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యేందుకు వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమలచైతన్య, డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ దామోదర్, వేదవతి పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి బి.మానస, ఎ.ప్రత్యూష, ద్వితీయ బహుమతిని ఆర్.శ్రీకర్, ఎన్.ఉదయ, తృతీయ బహుమతి ఎస్.యశ్వంత్, కె.కృష్ణ గెలుపొందారు. అనంతరం విజేతలకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

బొరివంక విద్యార్థుల సత్తా

కవిటి : రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన శ్రీకాకుళంలో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకర్, ఉదయ్‌లు పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు ఎంఇఒ ధనుంజయరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాలం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయానికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బందిని ప్రశంసించారు.

ఇచ్ఛాపురం : సర్వేను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

పకడ్బందీగా 'జగనన్న సురక్ష' సర్వే

ఇచ్ఛాపురం: జగనన్న సురక్ష సర్వేతో అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పురుషోత్తపురం సచివాలయం పరిధిలో ఎ.ఎస్.పేటలో వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న జగన్నన్న సురక్ష సర్వేను బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా వాలంటీర్లతో కలిసి స్వయంగా ప్రజల వద్దకు వెళ్లారు. జగన్నన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు ఇంటింటికీ వస్తారని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. అర్హతను బట్టి 11 ధ్రువపత్రాలను ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, రమేష్ అడ్మిన్ సెక్రటరీ దయాకర్, వార్డు కన్వీనర్ సాలీనా బాలాజీ, గృహ సారథులు పాల్గొన్నారు.

పలాస : జగనన్న సురక్ష యోజన పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఎంపిడిఒ రమేష్‌నాయుడు సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు సూచించారు. మండలంలోని నీలావతి, మాకన్నపల్లి గ్రామాల్లో చేపడుతున్న సురక్ష సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 30 లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఎవరికైనా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందక పోయినా, ఇతరతర సమస్యలు ఉన్న జగనన్న సురక్ష పథకంలో నమోదు చేసుకోవాలన్నారు. జులై 1 నుంచి సచివాలయాలు వద్ద ప్రారంభమయ్యే జగనన్న సురక్షలో అధికారులు సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య, నీలావతి సర్పంచ్ ప్రతినిధి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సొర్ర తిరుపతిరావు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి

పది కేజీల గంజాయి పట్టివేత

ఆమదాలవలస : పట్టణంలో పోలీసులు నిర్వహించిన సోదాల్లో పది కేజీల 495 గంజాయి, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు ఒడిశా రాష్ట్రం గుణుపూర్ నుంచి గంజాయిని తీసుకొచ్చారు. రాత్రి సమయంలో రైళ్లు లేకపోవడంతో స్థానిక కుమార్ రెసిడెన్సిలో ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తున్న బూర్జ ఎస్ఐ అశోక్‌బాబు రెసిడెన్సిలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కేరళకు చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గంజాయిని బుధవారం ఉదయం ఎస్ఐ-3 రఘునాథరావు, విఆర్ఒ నారాయణమూర్తి సమక్షంలో తూకం వేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

పోలాకి: ఈ నెల 22న గుప్పిడిపేటలో నందుపల్లి దనరాజుపై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. బాధితుడు దనరాజు ఫిర్యాదు మేరకు పి.వరలక్ష్మి, చెక్క మహేష్, చెక్క బూలరాజు, నందుపల్లి కొర్లయ్య, చెక్క అప్పయ్యను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు 14 రోజులు అంపోలు జిల్లా జైలుకు తరలించామని తెలిపారు.

వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: ఒడిశా రాష్ట్రం నుంచి టెక్కలి మీదుగా గతేడాది సెప్టెంబరు 6న ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలింపు కేసులో ఒడిశా గండాహాతికి చెందిన గణేష్ పండాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఎర్ర చందనం దుంగలు అక్రమ తరలింపు కేసులో అప్పట్లో 11 మందిని అరెస్టు చేశామని, ప్రధాన నిందితుడు తప్పికున్నారని అన్నారు. పట్టణంలో గణేష్ తిరుగుతుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పట్టపగలు చోరీ

ఎచ్చెర్ల : జాతీయ రహదారిపై కొయిరాళ్ల కూడలి సమీపంలోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు భారీ చోరీ జరిగింది. మండలంలోని ఫరీదుపేట కూడలి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఇంట్లో చోడవరం నారాయణరావు, లక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. రోజులానే లక్ష్మి ఉదయం ఏడు గంటలకు ఉపాధి హామీ పనులకు వెళ్లిపోయింది. ఎనిమిది గంటల సమయంలో ఇంటికి తాళం వేసి నారాయణరావు నవభారత్ పారిశ్రామిక వాడలో పనిచేయడానికి వెళ్లిపోయాడు. ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన లక్ష్మి చూడగా ఇంటి తలుపుల తాళాలు విరగొట్టే ఉన్నాయి. ఇంట్లో బీరువాలు, ఇతర సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నల్లపూసలు, తదితరవి 13 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షల నగదు చోడికి గురైనట్లు గుర్తించారు. ఉదయం 8 నుంచి 9.30 గంటల మధ్య ఈ చోరీ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల ఎస్ఐ ఆదాం తన సిబ్బందితో చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో రైల్వే ఉద్యోగి మృతి

శ్రీనివాసరావు(ఫైల్)

సోంపేట : మండలంలోని కొర్లాంకు చెందిన దివ్వల శ్రీనివాసరావు (48) రైల్వే ఉద్యోగి ఒడిశా రాష్ట్రం కాట్పాడిలో బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు శ్రీనివాస రావు స్థానికంగా పలు స్వచ్ఛంద సంస్థల సభ్యుడిగా చేరి గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారు లు ఉన్నారు. గురువారం స్వగ్రామం కొర్లంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపై సర్పంచ్ రాంబుడ్డి గణపతి, గ్రామ పెద్దలు, స్నేహితులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నగదు, బ్యాగ్‌ను అందజేస్తున్న ఆర్‌టిసి అధికారులు

ఆర్‌టిసి ఉద్యోగుల నిజాయితీ

పలాస : పలాస ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్లు బస్సులో ఓ ప్రయాణికుడు మరిచిపోయిన రూ.1.40 లక్షల నగదు, 10 తులాల వెండి పట్టీలను ఆయనకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. పలాస మండలం బెజ్జుపుట్టుగకు చెందిన బడే మాధవరావు కవిటి నుంచి బస్సులో ప్రయాణించారు. తన వెంట తెచ్చుకున్న రూ.1.40 లక్షల నగదు, 10 తులాల బరువున్న వెండి పట్టీలను బస్సులో మరిచిపోయి దిగిపోయాడు. దీన్ని గుర్తించిన బస్సు డ్రైవర్ ఎస్.కె.రావు, కండక్టర్ వి.పరసయ్యలు దాన్ని తీసుకొని డిపో సెక్యూరిటీ విభాగానికి అందించారు. ఇంటికి వెళ్లిన గుర్తుకొచ్చిన ప్రయాణికుడు డిపోలోని అధికారులను సంప్రదించారు. దీంతో ఆయనకు చెందిన వస్తువులు సరిచూసుకొని తగు ఆధారాలతో సెక్యూరిటీ ఆరెచ్సీ జి.రామ్మోహనరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు సమక్షంలో బాధితుడికి అందించారు. డ్రైవర్, కండకర్ నిజాయితీకి సిబ్బంది, ప్రయాణికులు అభినందించారు.

'వారాహి యాత్ర'కు స్పందన

పలాస : వారాహి యాత్రకు వచ్చిన ప్రజలను చూసి అధికార పార్టీకి భయం పట్టుకుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు ఒక ప్రకటనలో అన్నారు. అందుకే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సిఎం జగన్ పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలు ఇవ్వడానికి వెళ్లిన సిఎం పెళ్లిళ్లు, పెళ్లాల కోసం మాట్లాడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సిఎం హోదాలో ఉండి రాజకీయ దిగజారుడుతనం మీ అసమర్థతకు నిదర్శనమన్నారు. అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మీరు చేసే అభివృద్ధి, పథకాలను చెప్పుకోవాలని అన్నారు. ఇప్పటికైనా పవన్‌పై అవాకులు, చెవాకులు మానుకోవాలని హితవుపలికారు.

'అమ్మఒడి'తో పెరిగిన విద్యా ప్రమాణాలు

ప్రజాశక్తి- పోలాకి

సువ్వారి గాంధీ

అమ్మఒడితో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంచిన సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డికి ప్రతిఒక్కరూ జేజేలు పలుకుతున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికీ ఏటా రూ.15 వేలు ఆర్థికసాయం ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు ఇలా ఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకైనా పారదర్శకంగా, లంచాలకు వివక్షకు తావులేకుండా ప్రభుత్వం లబ్ధిచేకూర్చేందుకు పనిచేస్తోందని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునేలా, పాఠశాలలో డ్రాప్ అవుట్స్‌ను గణనీయంగా తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.

ఆమదాలవలస : అమ్మఒడితో విద్యా ప్రమాణాలను గణనీయంగా పెరుగుతాయని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. బుధవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేదరికమే అర్హతగా కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలకు డబ్బులను పారదర్శకంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ఖర్చు చేయనంత నిధులను వైసిపి ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని అన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి- కవిటి

మనం చేసే రక్తదానం ఎంతో మందికి ప్రాణదానం చేస్తుందని వైద్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పాతవరకలోని జై దుర్గాభవాని హార్డ్వేర్, సిమెంట్ షాప్ 3వ వార్షికోత్సవం సందర్భంగా జెమ్స్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో తలసేమియ పిల్లల కోసం బుధవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో సామాజిక స్పృహ మెండుగా ఉందని, ఎంతోమందికి ఉపయోగపడే ఇటువంటి రక్తదాన శిబిరాలు భవిష్యత్‌లో మరిన్ని నిర్వహించాలని సూచించారు. జైదుర్గా భవాని హార్డ్వేర్ సిమెంట్ షాప్ యజమాని మనోజ్ మాట్లాడుతూ తమ షాపు ప్రతి వార్షికోత్సవానికీ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా స్థానిక యువత ఉత్సాహంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారని పిలుపునిచ్చారు. ఈ మేరకు 55 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియా, రక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ధర్మరాజు, విశ్వేస్, సాహు కాళీ, హేమరాజ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మస్తరు ప్రకారం ఉపాధి పనులు చేసుకుంటే కనీస కూలి వస్తుందని సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించాలని ఎపిడి లోకేష్ అన్నారు. మండలంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న చెరువులో చేపడుతున్న ఉపాధి పనుల వద్ద బుధవారం ఉపాధి సిబ్బందికి శిక్షణిచ్చారు. చెరువు కొలతలు ఎలా చేపట్టాలి, అంచనాలను ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఒ శోభాదేవి, ఇసి నారాయణమ్మ, టిఎలు, ఎఫ్ఎలు, మేట్లు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎపిడి లోకేష్

హెల్మెట్ వినియోగంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జె.ఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్ సూచించారు. 16వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ వాడకంపై బుధవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని వారితో వెంటనే కొనిపించి అనంతరం వాహనాన్ని విడిచిపెట్టారు. మాట్లాడుతూ దిచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలనూ తప్పనిసరిగా ఉంచాలన్నారు. వాటినీ వెంట తీసుకుని రావాలని సూచించారు. ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఇచ్చి మరీ బయటకు పంపించాలని కోరారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను విస్మరిస్తున్న ప్రభుత్వం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- మందస

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గిరిజనులను విస్మరించిందని, గిరిజనులకు అండగా టిడిపి ఉంటుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం నరేష్ ఫంక్షన్ హాల్ పలాస నియోజకవర్గం గిరిజన ఆత్మీయ సమావేశం సవర రాంబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా గిరిజన సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. గిరిజన గ్రామాల్లో నూతన రోడ్లు వేయకపోగా, పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాలకు రవాణా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. టిడిపి హయాంలో గిరిజన గ్రామాల్లో మారుమూల కూడా బిటి రోడ్డులు, తాగునీరు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే ఒక్క తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే అన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే యువగళం పాదయాత్ర మందసలో లోకేష్ బాబుతోనే ఐటిడిఎ కార్యాలయం ఏర్పాటు కోసం స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేష్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పిరికట్ల విఠల్‌రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మండల పార్టీ అధ్యక్షులు దుర్యోధన, జనరల్ సెక్రటరీ రుద్రయ్య, నవీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

కలిసి పనిచేయడానికి సిద్ధం

మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ నుంచి ఏ ఒక్కరినీ విడిచి పెట్టుకోవాలన్నది తమ అభిమతం కాదని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నామని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి ఎల్లప్పుడూ బలంగానే ఉందన్నారు. అయితే ఎన్నికల సమయంలో గ్రూపులుగా వీడి పని చేయడం వల్ల కొన్ని సార్లు ఓటమి చవి చూడాల్సి వస్తోందన్నారు. అందువల్ల ఈ పరిస్థితిని అధిగమించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ పరిశీలకులు చింతల రామకృష్ణ సూచనను స్వాగతిస్తున్నామన్నారు. పెద్దపాడు, తంగివానిపేట, వానవానిపేట, శాస్త్రులపేటలో తనకెప్పుడూ మెజార్టీ రాలేదని గుర్తు చేశారు.

పాల్గొన్న యాత్రికులు

ముగిసిన జగన్నాథ రథయాత్ర

ఇచ్ఛాపురం :ఉత్కళాంధ్ర ఆరాధ్య దైవం జగన్నాథ స్వామి రథయాత్ర విజయవంతంగా బుధవారం ముగిసింది. ఈ నెల 20న ప్రధాన ఆలయం నుంచి గుడెంచ వరకు ఈ యాత్ర సాగింది. గుడెంచా మందిరంలో వారం రోజులు పాటు దశావతారాలను యాత్రికులు దర్శించుకున్నారు. ఆఖరి రోజు దాసన్నపేట నుంచి యాత్రికులు జైజై నినాదాలతో ప్రధాన ఆలయం వరకు యాత్రి సాగింది. రథయాత్ర సందర్భంగా ఎండోమెంట్ అధికారులు జగన్నాథ్ సేవాదళ్ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ యాత్రకు ఇచ్ఛాపురం, పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు తరలివచ్చారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు అధ్వర్యాన పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రవికుమార్ పరామర్శ

బూర్జ : మండలంలోని నీలాదేవిపురంలో పి.కన్నయ్య, ఎం.ఈశ్వరరావు, డి.జాన్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ బుధవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు వావలపల్లి రాంజీనాయుడు, లంక జనార్ధన్‌నాయుడు, కె.కృష్ణ, మజ్జి శ్రీరాములు ఉన్నారు.

అందరూ సమానమే

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో అన్ని తరగతులూ ఒక్కటేనని, అందరూ సమానత్వం అనే విషయాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ అన్నారు. పట్టణంలోని గొడగల వీధిలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ విజిలెన్స్ మోనటరింగ్ సభ్యులు బెలమర ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటరానితనం నేరం అనే విషయంపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపిడిఒ హనుమంతు వెంకట రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ చట్టవ్యతిరేక పనులను ప్రోత్సహించడంలో తరగతులను చాలామంది వినియోగించుకుంటారని, అటువంటి వాటిని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశం కార్యదర్శి రామారావు, కూన వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభాకరరావు

మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాదకద్రవ్యాలు రైళ్లలో అక్రమ రవాణా జరగకుండా అరికట్టాలని జిఆర్‌పి లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు జిఆర్‌పి పోలీసులకు ఆదేశించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సంయుక్తంగా నేరాలను అరికట్టాలన్నారు. ప్లాట్ ఫామ్ బీట్స్, ట్రైన్ బీట్స్‌లో సిబ్బందిని నియమించాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని నేరాలను అరికట్టాలని సూచించారు. రైల్వే భద్రతా నియమాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలన్నారు. విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఫుట్ బోర్డు ప్రయాణంపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్టేషన్ స్టాల్స్‌లో పనిచేసే సిబ్బంది, కూలీల దగ్గర నుంచి సమాచారాన్ని సేకరించి నేరాలు చేసే వారిపై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి, బంగారం తదితర అక్రమ రవాణాపై దృష్టి సారించి నిందితులను పట్టుకొని కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలాస జిఆర్‌పి ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ పాల్గొన్నారు.

పలాస : పలాస రైల్వే జిఆర్‌పి పోలీసు స్టేషన్‌ను విశాఖ జిఆర్‌పి లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు సందర్శించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించారు. రైళ్లలో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు ఫుట్ బోర్డుపై ప్రయాణం రాదని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా గంజాయి, నల్లమందు వంటి మత్తు పదార్థాలు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పలాస జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ ఉన్నారు.

ఆమదాలవలస : సిబ్బందికి సూచనలు ఇస్తున్న వెంకటరావు

కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఇచ్ఛాపురం : విద్యాశాఖలో ఇటీవల ఎంఇఒ-2 పోస్టుల భర్తీతో ఏర్పడిన హైస్కూల్ హెచ్ఎం పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎపి ఎస్‌సి ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30న సీనియారిటీ జాబితాల ప్రకటన, జులై 2 వరకు అభ్యంతరాల స్వీకరణ, 3న తుది సీనియారిటీ జాబితా విడుదల, 4న ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ నిర్వహణ, 5న కొత్త ప్రదేశాల్లో విధుల్లోకి చేరుతారని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి జులై 5న నిర్వహిస్తారని, 6న కొత్త ప్రదేశాల్లో విధుల్లోకి చేరాల్సి ఉంటుందని తెలిపారు.

రణస్థలం : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియర్ జాబితాలు సిద్ధంగా ఉన్నాయని ఎపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బొంతు అప్పలనాయుడు, అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు ప్రస్తుతం ఉద్యోగోన్నతులు లేవని తెలిపారు.

పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో వెల్‌నెస్ కేంద్రాల్లో విధుల నిర్వాహణలో వైద్య సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి హెచ్చరించారు. మండల కేంద్రంలోని వెల్‌నెస్ కేంద్రం-2ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో చేపడుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అధికారులు తనిఖీ సమయాల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోతే సస్పెండ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈమెతో పాటు తాడివలస పిహెచ్‌సి వైద్యాధికారి జి.రమేష్‌నాయుడు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది పేద విద్యార్థులకు విద్యాసామగ్రి, నగదు అందజేశామని బిగ్‌హెల్ప్ డైరెక్టర్ రాముని రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు అంగూరు ధర్మారావు బుధవారం అందించారు. ఏకరూప దుస్తులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రిని, అలాగు దుస్తుల కుట్టు కూలి అందజేశారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఛైర్మన్ ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి విద్యావతి, బి.లత, శ్రీనివాసరావు, వీరాస్వామిరెడ్డి, ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎంఇఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఎంఇఒ-1గా పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకూ ఎంఇఒ-1గా ఉన్న పి.వి.రామరాజు కోటబొమ్మళి ఎంఇఒగా బదిలీ అయ్యారు. ఎంఇఒ-1గా వెంకటరావుకు పుష్పగుచ్ఛం అందించి ఎంఇఒ-2 పి.రాజారావు, కంప్యూటర్ ఆపరేటర్ సత్యనారాయణ, అకౌంటెంట్ సంతోష్, సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

బాలలతో పనులు చేయించడం నేరం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

బాలలతో పనిచేయించడం నేరమని, బాల బాలికలతో ఎవరైనా వెట్టి చాకిరీ చేయించినా, హింసించినా జరిమానా పాటు జైలుశిక్ష తప్పదని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు హెచ్చరించారు. పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు ప్రకారం మండల న్యాయ సంఘం, బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం బాలబాలికలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటినుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే ధైర్యంగా వాటిని ఎదిరించాలని, పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పిండి వెంకటరావు, సంయుక్త కార్యదర్శి అనిల్‌రాజు, ట్రెజరర్ రవి, న్యాయవాదులు ఎన్.వి.రమణ, కోత రజనీకుమార్, కామేశ్వర పట్నాయక్, దేవరాజు, బోయిన లక్ష్మి, హెచ్ఎం తులసీదాస్, ఎస్ఎంసి ఛైర్మన్ ఎల్.శ్రీనివాస్, పీడీ తవిటయ్య ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ అప్పలస్వామి, విజయ్, సంజీవరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఇచ్ఛాపురం : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేందర్‌రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అందరి ఆరోగ్యాన్ని కాపాడే అద్భుతమైన బాధ్యత వృక్షాలకు ఉంటుందని అన్నారు. మొక్కలు నాటే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు పొట్నూరు

మొక్కను నాటుతున్న దేవేందర్‌రెడ్డి

శంకరరావు, అధ్యక్షుడు పల్లంటి చిరంజీవి, ఉపాధ్యక్షుడు బొండాడ శంకర్, కార్యదర్శి పాలెపు దివాకర్, కార్యవర్గ సభ్యులు పిలక కృష్ణతేజారెడ్డి, మాధవరావు, సూర్య, మణిసాహు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

వజ్రపుకొత్తూరు : సీతమ్మను సన్మానిస్తున్న సర్పంచ్ గిరిజ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఏడేళ్లగా విధులు నిర్వహించి బదిలీపై అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన జి.సీతమ్మ సేవలు మరువలేనివని సర్పంచ్ జి.గిరిజ అన్నారు. సైనింగ్ స్టార్ యువజన సంఘం సభ్యులు సహకారంతో చింతల పోలమ్మ కళా వేదిక వద్ద ఆమెను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎంగా విధులు నిర్వహించిన దగ్గర నుంచి అనేక మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ప్రయోజకులయ్యే విధంగా బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు వై.ధర్మారావు, యువజన సంఘం అధ్యక్షులు వై.సంతోష్‌కుమార్, వార్డు మెంబర్లు భీమారావు, ధనరాజ్, వల్లభరావు, వై.ఆనందరావు, వై.అప్పారావు, నగేష్, మహేష్, నిఖిల్, కళ్యాణ్, కృష్ణవేణి, పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని పిట్టపాలెంలో పదేళ్ల పాటు పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కోడండ రామయ్యని ఎంఇఒ త్రినాథరావు, హెచ్ఎం నారాయణరావు అధ్యక్షతన గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, అప్పన్న, ఉపాధ్యాయులు, శంకరరావు, కామేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

మరుగుదొడ్లు శుభ్రం చేయించాలి

మెళియాపుట్టి : మెనూ సక్రమంగా అమలు చేయాలని తహశీల్దార్ పి.సరోజని సూచించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను శుభ్రం లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు నియమించిన స్వీపర్‌ను మార్చాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహశీల్దార్ సరోజిని

విద్యార్థులు తాగడానికి నీరు లేదని, ఆర్ఒ ప్లాంట్ ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈమె వెంట హెచ్ఎం దుర్గారావు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ దీపాలపై వాడివేడి చర్చ

మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన టెక్కలి మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పంచాయతీ సర్వసభ్య సమావేశానికి 20 మంది సభ్యులు ఉండగా, 13 మంది హాజరయ్యారు. జగతిమెట్ట కూడలి నుంచి చేరి ధి నేషనల్ హైవే రోడ్డు వరకు సెంట్రల్ ఉన్న విద్యుత్ దీపాలు ఒక్కటి వెలగడం లేదని వార్డు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్అండ్‌బి డిపార్ట్‌మెంట్ పంచాయతీకి అప్పజెప్పలేదని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని కార్యదర్శి బొడ్డేపల్లి రామారావు సభ్యులకు తెలిపారు. అనంతరం పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధంపై తీర్మానించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- రణస్థలం

అర్హులందరికీ దళారులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పైడిభీమవరం-2 గ్రామ సచివాలయం పరిధిలోని వరిసాం, గొల్లపేట గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డిబుజ్జి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రెడ్డి విశ్వేశ్వరరావు, మహిళా అధ్యక్షులు గురాన మానస పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు చేరువలో ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో 9, 10 వార్డులకు సంబంధించి గృహ పథకం మంజూరైన 12 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రత్తకన్న లేఅవుట్, కొళిగాం రోడ్డు వద్ద వీరికి స్థలాలను కేటాయించామన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు తప్పకుండా అందుతున్నాయని అన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, వార్డు కౌన్సిలర్ బి.జగన్, పోనపువ్వుల తేజేశ్వరరావు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలయోగి పాఠశాల సందర్శన

నందిగాం : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ బాలాజీనాయక్ బుధవారం సందర్శించారు. అనంతరం కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకులంలోని సమస్యలపై చర్చించారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ గురుకులంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి తమవంతు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించడంతోపాటు నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. వీరితో పాటు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రిన్సిపాల్ దమయంతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ ఉన్నారు.

304 పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని యరకయ్యపేట, కన్నేవలస, చుట్టుగుండం, చలమయ్యపేట, నారాయణపురం గ్రామాల పరిధిలోని 304 పశువులకు బుధవారం గొంతు, జబ్బువాపు నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాధి నివారణ టీకాలు మండలంలోని వేస్తున్నామని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి బొడ్డ అప్పన్న, స్థానిక పశు సంవర్ధక సహాయకులు కె.ముకుందరావు పాల్గొన్నారు.